

# ప్రేమ బలి

౧

అది ఒక మహాపట్టణము. పట్టణమునకు తూర్పుదిశయందు సముద్రమున్నది. దానిపై నుండివచ్చు నిర్మలవాయువులు దాని వాతావరణస్థితిని పూర్తిగా మార్చివేయుచున్నవి. పరమాంస భక్షులను మెప్పించునట్టి ధనికులు ఆనగరమున పలువురుకలరు. దేవదత్తుడను వాడు వారిలో నగ్రగణ్యుడు. అతనికి బట్టల మిల్లు ఒకటికలదు. దానిలో పనివారికి కాలునివలె కనుపించుచు బహుళమగు ధనము సంపాధించెను.

హాలాహలములో అమృతమువలె, బురద నీటిలో కమలమువలె సీత అతని ఏకైకపుత్రిక సీత తన శీతలమగు దృష్టిచేతను, మధురమగు మాటలచేతను పరిజనమునకు ఆనందము కలిగించుచుండెను.

కాలమే కాలుడు! బీదల కన్నీటిధారలచే బయలుడలిన నదీప్రవాహములో యజమాని కొట్టుకొనిపోయి కాలగర్భమున దాగిపోయెను.

ఇప్పుడు మిల్లు యజమాని సీత. ఆమె తన సహజలావణ్యముచేతను బుద్ధిబలముచేతను, ఔదార్యముచేతను తన పనివాండ్రకు ఉత్సాహమును కలిగించి, తనకు. మిల్లునకు ఖ్యాతి గణించెను.

*   *   *

రామారావు బి. ఎ. జదివినవాడు. రూపవంతుడు వినయ సంపన్నుడు మాటలచే పరులను లోబరచుకొను శక్తికలవాడు కాని బీదవాడు.

రామారావు మిల్లునందు ఉద్యోగమునకు కుదిరెను. అతడు విసుకు విరామములేక పని చేయుచు యజమానురాలియొక్క గౌరవమును పొందెను.

కాలము ఎల్లప్పుడు ఒకేవిధమున జరుగదు. సీతకు యిప్పుడు యిరువది సంవత్సరములు నిండినవి. నేటివరకును ఏకాగ్రతతో తన మిల్లును చూచు నామె ఇప్పుడు ఎక్కడలేని ఉద్రేకము కలిగెను. ఆమె ప్రేమ ప్రవాహములోపడి కొట్టుకొనుచున్నది.

రామారావుయొక్క రూపము, నల్లని శిరోజములు, విశాల వక్షము ఆమెను ఆకర్షించినవి. మేఘములకొరకు ఎదురుచూచు నెమలివలె, కాసారముకొరకు వెదకు హంసవలె ఆమె వానిప్రేమకొరకు చూచుచున్నది.

యిట్టిస్థితిలోనుండి మదనపీడితయై తన పనులను చేయజాలక రామారావుని తన మిల్లు యజమానిగా నియమించెను.



432

## ౨

బల్లున తెల్లవారినది. కాకులు కాకాయని కూయుచున్నవి. రామారావు యజమాని అయిన సంగతి బట్టబయలైన వైన కర్మాగార మంతయు గాలితో బాటు వ్యాపించెను.

వినాశకాలే విపరీతబుద్ధిః అన్నట్లు ఈ కార్యభారము నెత్తిన పడుటవల్ల వినయ విధేయతలు వృద్ధియగుటకు మారుగా రామారావుకు ఉద్యోగగర్వ మావహించినది. తీయని జలములతో కూడుకొని ప్రవాహించు నది సముద్రములోపడి తనరూపును ఎట్లు మాపుకొనుచున్నదో అట్లు రామరావుకు ధన మదముచే తన సౌశీల్యము యెడ నసించినది. పూర్వము ఏపనివాండ్రతో కలసి పనిచేసి నాడో వారికే తాను కటకమైనాడు.

సీతసర్వకాలవస్థలయందు రామారావునే తలంచి విరహబాధ పడుచుండెను.

అది సంధ్యాసమయము తాను యిట్లు మారుటకు ప్రకృతిలక్ష్మి కోపించుచున్నదా యనట్లు పడమటదిక్కు ఎర్రబారినది. యీమెకు రాబోవుకష్టమునకు దుఃఖించుచున్నవా యన్నట్లు పక్షులు గోలపెట్టుచున్నవి. కాలుడు మింగ్రగమూదుచున్నాడా యన్నట్లు కారుచీకటులు నలుదెశలను క్రమ్ముకొనుచున్నవి. అట్టి సమయమున రామారావు కార్యనిమగ్నుడై ఆమెను చూడవచ్చెను. అతడు 'మిల్లువారు' తనపై అగ్రహించి సమ్మెగట్టినెంచినారని ఆమె కెరింగించెను.

తానుపోయి వారినినివారింతమని తలంచినది. బరువైన నహృదయములో ఆరేయి నిదురపట్టినది కాదు

రాబోవు రక్తపాతమూయనునట్లు తూర్పుదేశ ఎర్రబారినది కాకులు కావుకావు మనుచు పక్షబలమునుచూపి ప్రకృతి లక్ష్మిని చేరబోవుచున్నవి. యింతలో సూర్యుడు ఉదయాద్రిని జేరెను. అతడు తన సహస్రకరములతో భూదేవిని కౌగలించుకొనుచుండెను. పద్మములు విచ్చి భ్రమరములకై చూచుచున్నవి. కోకిల మధురగీతముల పాడుచుండెను. అట్టిసమయమున సీత మేల్కాంచి తాను కామాంధురాలై పుత్రులవలెచూచిన పనివాండ్రకు అపకారముచేసి తిననిసిగ్గు పడి వారలను చేరుటకు కాళ్లురాక తనగదిలోనే చతికిలబడి తను ప్రేమించినవానిగతిఏమియగునోయని వేచియుండెను.

యింతలో సెమ్మెదారులు ఉప్పొంగిన సముద్రమువలె రామారావు యిల్లు ముట్టడించిరి. అతడు వారికి తగిన సమాధాన మీయనందున సంఘర్ష ణజరిగెను దానిలో రామారావునకు తలపగిలెను.

ఈవార్త సీతకు తెలిసినది. అది చెవికి సోకగానే తైలములేని దీపమువలె, ఆధారము లేని లతవలె నేలకొరిగినది. నదిలో నీరు యింకగా యిసుకతిన్నెలు బయలుపడినట్లు ఆమె ఎత్తైన ఎర్రని చెక్కిళ్లు ఒక్కమారుగా తెల్లబారినవి. దేనికొరకు యింతకాలము వేచియున్నదో దానిని విధి ఆమెనుండి వేరు చేసినందులకు మనమున చింతించుచు వానిని వెదకుటకుగాను ఆ అర్థరాత్రి నక్షత్రముల వెలుగులో తూర్పుదిశగా నడచిపోయినది.

—కె. ఆర్. మూర్తి.